విశాలాంధ్ర అనంతపురం
www.visalaandhra.com
కర్నూలు, సోమవారం 15, డిసెంబర్ 2025

కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్

విశాలాంధ్ర-యాడికి : ఎస్పీ జగదీష్ ఉత్తర్వుల మేరకు యాడికి మండలంలోని బోయరెడ్డిపల్లి గ్రామంలో ఆదివారం విస్తృత స్థాయిలో కార్డెన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. యాడికి సీఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో తాడిపత్రి టౌన్ ఎస్ఐ, తాడిపత్రి రూరల్ ఎస్ఐ, పప్పూరు ఎస్ఐ, పెద్దవడుగూరు ఇన్స్పెక్టర్ తమ సిబ్బందితో పాటు యాడికి పోలీస్ సిబ్బంది సంయుక్తంగా ఈ తనిఖీలు చేపట్టారు. గ్రామంలోని అనుమానాస్పద వ్యక్తుల ఇండ్ల వద్ద తనిఖీలు నిర్వహించడంతో పాటు, పాత కేసుల్లో నిందితులుగా ఉన్న వ్యక్తుల నివాసాలను కూడా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎలాంటి అనుమానాస్పద వస్తువులు లేదా వ్యక్తులు కనిపించలేదని పోలీసులు తెలిపారు. గ్రామంలో శాంతి భద్రతలు పటిష్టంగా ఉంచేందుకు ఇటువంటి తనిఖీలు కొనసాగుతాయని పోలీసులు వెల్లడించారు.

సీనియర్ వీఆర్ఏ మృతి

విశాలాంధ్ర-రాప్తాడు: రాప్తాడు గ్రామానికి చెందిన తలారి రాజప్ప(వీఆర్ఏ) (75) శనివారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. తహశీల్దార్ కార్యాలయంలో వీఆర్ఏగా పనిచేస్తూ ప్రసన్నాయపల్లి గ్రామ రెవెన్యూ సహాయకులుగ 40 ఏళ్లు సుదీర్ఘంగా పనిచేశారు. చదువురాకపోయినా కూడా కొత్తగా వచ్చిన వీఆర్ఓలు గ్రామంలో రెవెన్యూ పొలం యజమానుల పేర్లు చెబితే పొలాలు కచ్చితంగా వీరివేనని హద్దులు చూపించే వారు. అంతటి ఏకాగ్రత ఉన్నవాడు తలారి రాజప్ప. కాగా శనివారం విధులు ముగించుకుని సాయంత్రం ఇంటికి వెళ్లారు. ఇంటి వద్ద రాత్రి అనారోగ్యానికి గురికావడంతో కుటుంబ సభ్యులు ఓ ప్రయివేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించాడు. తహశీల్దార్ బి.విజయకుమారి ఆధ్వర్యంలో ఆర్.ఐ. కరుణాకర్, వీఆర్ఓ మనోజ్, వీఆర్ఏలు తలారి కర్ణ, క్రాంతి, నాగన్న ప్రభుత్వం తరపున రూ.25వేలు నగదు ఆర్థిక సాయం అందజేశారు.

ముళ్లపొదలు తొలగింపు

విశాలాంధ్ర-విడపనకల్లు: పాల్తూరు గ్రామపంచాయతీలో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ మరియు జిల్లా టిడిపి సీనియర్ నాయకులు పయ్యావుల శ్రీనివాసులు ఆదేశాల మేరకు సర్పంచ్ బ్యూలారాణి ఆధ్వర్యంలో పాల్తూరు గ్రామం నుండి జి.మల్లాపురంకు వెళ్లే ప్రధాన రహదారికి ఇరువైపులా ఏపుగా పెరిగి కంప చెట్లు పెరిగి జడ్.పి.హెచ్.ఎస్ స్కూల్ విద్యార్థులు, పొలాలకు వెళ్లే రైతులు ఇబ్బంది పడుతుండటంతో జెసిపితో క్లీన్ చేయడం చూసి ప్రజలు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ నాగభూషణం, డిసిసి కాలువ ప్రెసిడెంట్ కాలమారయ్య, మాజీ ఎంపీటీసీ కుమారస్వామి, నాయకులు బాలకృష్ణ, తిప్పేస్వామి, బాల మూర్తి, రాజశేఖర్ పాల్గొన్నారు.

హాస్టల్స్ పని తీరు మారలేదు

విశాలాంధ్ర-ఉరవకొండ : ఫుడ్ కమిషన్ మెంబర్ గంజి మాలాదేవి ప్రభుత్వ హాస్టల్లో తనిఖీ చేసినప్పటికీ హాస్టల్స్ పనితీరులో ఎలాంటి మార్పు లేదని హరిత దివ్యాంగుల సేవా సమితి రాష్ట్ర అధ్యక్షులు బి.మోహన్‌నాయక్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టల్‌లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ ఎస్సీ, ఎస్టీ బిసి,గిరిజన గురుకులాల్లో నాణ్యమైన భోజనం ఇవ్వండం లేదని, మెనూ ప్రకారం అందిచడం లేదని, చికెన్ నీళ్ళరసంతో ఒకటి, రెండు, ముక్కలు మాత్రమే ఇస్తున్నారని ఆదివారం బిర్యానీ ఇవ్వాల్సి ఉండగా సరిగ్గా ఇవ్వడం లేదని పెరుగు పచ్చడి, గోగాగు పచ్చడి ఇవ్వడం లేదని రసం చికెన్ మాత్రమే ఇస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా అన్ని ప్రభుత్వ హాస్టల్స్‌లో కూడా నాణ్యమైన భోజనం, మెను ప్రకారం అందించాలని, వారంలో రెండుసార్లు హాస్టల్‌ను తనిఖీ చేయాలన్నారు. లేనిపక్షంలో విద్యార్థులతో కలిసి రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యాక్రమాలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో భాస్కర్, మణికంఠ చంటి, అశోక్, రమేష్, రామకృష్ణ, ధర్మకుమార్, రమణ అంజి పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

విశాలాంధ్ర-యాడికి : అమీనా కంటి ఆసుపత్రి వారి ఆధ్వర్యంలో నంద్యాల శాంతి రామ్ కంటి ఆసుపత్రి వారిచే యాడికి మండల కేంద్రంలోని పాత పోలీస్ స్టేషన్ దగ్గర అమీనా ఆప్టికల్స్‌లో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. 80 మందికి కంటి వైద్య నిపుణులు తిప్పే స్వామి పరీక్షలు నిర్వహించారు. ఇందులో 18 మందికి ఆపరేషన్లకు ఎంపిక చేశారు. ఆపరేషన్ల కొరకు వెళ్లే వారికి ఉచిత బస్సు, భోజన వసతి సౌకర్యం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో అమీనా కంటి ఆసుపత్రి యజమాని సయ్యద్ పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

విశాలాంధ్ర-డి.హీరేహాళ్ : కాదలూరు గ్రామంలో శుక్రవారం వైసీపీ కార్యకర్త, నాగేంద్ర కుమారుడు మాజీ వాలంటీర్ గంగాధర అనారోగ్యంతో మరణించారు విషయం తెలుసుకొన్న రాయదుర్గం నియోజకవర్గం వైసీపీ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి ఆదివారం ఉదయం కాదలూరు గ్రామానికి చేరుకొని నాగేంద్ర కుటుంబ సభ్యులను పరామర్శించారు. గంగాధర ఆత్మకు శాంతి కలగాలని ఆకాంక్షించారు.

12వ వేతన సవరణ కమిటీ వెంటనే వేయాలి

- రాష్ట్రోపాధ్యాయ సంఘం

విశాలాంధ్ర బ్యూరో- అనంతపురం: 12వ వేతన సవరణ కమిటీని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే వేయాలని అనంతపురం జిల్లా రాష్ట్రోపాధ్యాయ సంఘం డిమాండు చేసింది. ఆదివారం ఉపాధ్యాయ సమస్యలపై 79 వ కౌన్సిల్ సమావేశం సిపిఐ కార్యాలయంలో జరిగింది. సమస్యలపై ఎస్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు మాట్లాడుతూఏకీకృత సర్వీసు రూల్స్ అమలు చేయాలి. పదోన్నతులు కల్పించాలని, 2010 కంటే ముందే నియామకమైన ఉపాధ్యాయులకు టెట్ నుండి మినహాయించాలని, 12వ పిఆర్‌సి కమిషన్ పునరుద్ధరించాలని, 29శాతం ఐఆర్‌ను ప్రకటించాలని, ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లించాలని, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, మోడల్ ప్రాదమిక పాఠశాలలలోగురు ఉపాధ్యాయులను నియమించాలని, మున్సిపల్ ఉపాధ్యాయులకు పీఎఫ్ సౌకర్యం కల్పించాలని, ఉపాధ్యాయులను బోధనకె పరిమితం చేయాలని, గిరిజన సంక్షేమ పాఠశాలల సమస్యలు పరిష్కరించాలని, మోడల్ స్కూల్ టీచర్ల సర్వీస్ రూల్స్ వెంటనే ప్రకటించాలని కోరారు. అర్హత కలిగిన ఎస్‌జిటిలకు ఎస్ఎ పండిట్‌లుగా ప్రమోషన్ కల్పించాలని, ప్రాథమిక విద్య మాతృభాషలోనే జరగాలని, ఉన్నత పాఠశాలలలో తెలుగు, ఇంగ్లిష్ మీడియాలు కొనసాగాలని, హైస్కూల్ ప్లస్ పాఠశాలలను బలోపేతం చేయాలని, ఎంటిఎస్ ఉపాధ్యాయులను రెగ్యులర్ చేయాలని, జెడ్పీ ఉపాధ్యాయులకు జూనియర్ లెక్చరర్‌గా (జెల్)గా పదోన్నతులు కల్పించాలని, కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, హెల్త్ కార్డు సమస్యను వేగవంతంగా పరిష్కరించాలని కోరారు.

గుత్తి కోటకు రహదారి ఏర్పాటును పరిశీలించిన కలక్టర్

- త్వరగా రహదారిని ఏర్పాటు చేస్తామని వెల్లడి..

విశాలాంధ్ర-గుత్తి: గుత్తి కోటను ఆదివారం కలెక్టర్ ఆనంద్ కుటుంబ సభ్యులతో సందర్శించారు. అనంతరం జాతీయ రహదారులు 44 వ, 67వ రహదారి నుంచి గుత్తి కోటకు రోడ్డు మార్గంను ఆదివారం గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షులు విజయభాస్కర్, రెవెన్యూ అధికారులతో కలిసి పరిశీలించారు. అదేవిధంగా గుర్రపుశాలకు వద్ద కనెక్టివిటీని పరిశీలించారు. హైదరాబాద్ బెంగళూరు, చెన్నై, హంపి తదితర పట్టణాల నుండి గుత్తి కోటకు ఆనుకొని ఉన్న జాతీయ రహదారుల గుండా కొన్ని వేల వాహనాలు వెళ్తుంటాయి. వాహనాల్లో వెళ్లే వారికి ఒక గంట సేపు సేద తీర్చుకోవడానికి అలాగే గుత్తి కోటలోని పర్యాటక ప్రదేశాలను చూసి ఆనందించడానికి, జాతీయ రహదారులకు వద్ద ఉన్న అనువైన ప్రదేశాలను, కోటకు దగ్గరగా ఉండే రహదారిని పరిశీలించారు. త్వరలోనే గుత్తి కోటకు రహదారిని ఏర్పాటు చేసేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో గుత్తి తహసీల్దార్ పుణ్యవతి, మున్సిపల్ కమిషనర్ జబ్బర్ మియా, ఎంపీడీఓ ప్రభాకర్ నాయక్, గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షులు విజయభాస్కర్, గ్రామ సర్పంచ్ మస్తాన్, మండల సర్వేయర్, వీఆర్ఓ సురేంద్ర, విఆర్ఏలు, రెవిన్యూ సిబ్బంది, మునిసిపల్ సర్వేయర్, మునిసిపల్ సిబ్బంది, సమితి సభ్యులు పాల్గొన్నారు.

అభిమానుల మధ్యలో జన్మదిన వేడుకలు

శాలాంధ్ర-కణేకల్లు: రాష్ట్ర ఉప్పర కార్పొరేషన్ డైరెక్టర్ క్లస్టర్ ఇంచార్జ్ ఆనంద్ రాజులు జన్మదిన వేడుకలను కనేకల్ క్రాస్ లోని వారి స్వగృహం నందు ఆదివారం రోజున ఘనంగా నిర్వహించారు. ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని వేడుకలను మరింత ఉత్సాహభరితంగా నిర్వహించారు. ఆనంద్ రాజులు సేవలను ప్రశంసిస్తూ నాయకులు ఆయనకు ఆయురారోగ్యాలు, రాజకీయ జీవితంలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మాజీ మండల కన్వీనర్ లాలప్ప, మండల కన్వీనర్ వన్నారెడ్డి, చెరువు సంఘం అధ్యక్షులు బిటి. రమేష్, వ్యవసాయ కమిటీ సభ్యులు చాంద్‌బాషా, కవిట్ మాబు, రైస్ మిల్ కాంట్రాక్టర్ నాగప్ప, సంపత్, రాజా తదితర టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

ఫిజియోథెరపీతో ఉజ్వల భవిష్యత్తు

విశాలాంధ్ర-అనంతపురం: అనంతపురం కస్తూరి కాలేజ్ ఆఫ్ ఫిజియోథెరపీ 20వ గ్రాడ్యుయేషన్ వేడుకలకు ముఖ్య అతిథిగా డా. ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ డా. చంద్రశేఖర్ హాజరై ఫిజియోథెరపీ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ రోగాన్ని నయం చేయడంలో ఫిజియో థెరపీల పాత్ర ఎంతో కీలకం అన్నారు. ఫిజియో థెరపీ వల్ల అత్యంత వేగవంతంగా కొన్ని జబ్బులలో వ్యాధిగ్రస్తులకు ఉపశమనం కలిగి ఆరోగ్యవంతులవుతారని తెలిపారు. 25 సంవత్సరాల పాటు అనంతపురంలో ఫిజియోథెరపీ వైద్య విద్యనందిస్తు ఫిజియోథెరపీ సేవలను అనంతనగరంలో ప్రజలకు చేరువు చేస్తున్న కస్తూరి ఫిజియోథెరపీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ప్రహ్లాద, యాజమాన్యం సెక్రెటరీ డాక్టర్ సుదర్శన్, కరస్పాండెంట్ చంద్రశేఖర్, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బందిని, విద్యార్థుల ప్రతిభను ప్రత్యేకంగా అభినందించారు. ఆంధ్రప్రదేశ్లో అన్ని ప్రైవేట్ ఫిజియోథెరపీ కళాశాలలు ఉన్నాయని ఈ సంవత్సరం కొత్తగా ప్రభుత్వ వైద్య కళాశాలలో ఫిజియోథెరపీ కోర్సులను కూడా ప్రారంభించబోతున్నామని తెలిపారు. వైద్య వృత్తిలో ఎన్ని లక్షలు సంపాదించామన్నది ముఖ్యం కాదని, ఎన్ని లక్షల మంది హృదయాలలో చిరుస్థాయిగా నిలిచిపోయామన్నది ముఖ్యమని తెలిపారు. ఉత్తీర్ణులైన విద్యార్థులకు డిగ్రీ సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. బి.పి.టిలో యూనివర్సిటీలో ప్రథమ స్థానం సంపాదించిన కస్తూరి ఫిజియో థెరపీ కళాశాల విద్యార్థిని వరలక్ష్మిని వారి తల్లిదండ్రులను ప్రత్యేకంగా ప్రశంశా పత్రం మెడల్స్‌తో అభినందించారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు నిర్వహించిన స్వాగత వీడ్కోలు పరేడ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కుమారి ఐద్వీటి నాగసాయి హిమజ, ఆదిరెడ్డి హస్విత మహాలక్ష్మి ప్రదర్శించిన అర్ధనారీశ్వర నృత్యం ఆహుతలను అలరించింది. అనంతపురం సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి డిప్యూటీ సూపరిం టెండెంట్ డాక్టర్ బెనెడిక్ట, న్యూరో సర్జరీ ప్రధాన విభాగాధిపతి డా.భాస్కర్ పాల్గొన్నారు.

భౌతిక దాడులు చెడు సాంప్రదాయాలకు బీజం

విశాలాంధ్ర-విడపనకల్లు : మండలంలోనిఇ ఉండబండ గ్రామంలో గత గురువారం గోపాల్ అనే వ్యక్తి మీద టిడిపికి చెందిన కొంతమంది వ్యక్తులు విచక్షణ రహితంగా దాడి చేసి గాయపరిచారు. బాధితుడు గోపాల్ కి ఫోన్ చేసి దాడికి సంబంధించిన వివరాలను, ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వర్‌రెడ్డి అడిగి తెలుసుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న వైసీపీ సీనియర్ నాయకులు కరణం భీమరెడ్డి, వైసిపి కన్వీనర్ కురుబ రమేష్, మండల వైసీపీ ఉపాధ్యక్షుడు బోయ నాగేంద్ర, నాయకులు సుంకన్న గోపాల్ కుటుంబాన్ని పరామర్శించారు. బాధితుడుతో మాట్లాడుతూ మీకు, మీ కుటుంబానికి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని, దాడి చేసిన వారిపై వెంటనే కేసు నమోదు చేయడంతో పాటు చర్యలు తీసుకోవాలని పోలీస్ శాఖ ను కోరుతామన్నారు. లేనిపక్షంలో దాడి చేసిన వారిపై న్యాయపరంగా చర్యలు తీసుకునే విధంగా చూస్తామని తెలిపారు. సీనియర్ నాయకులతో పాటు హేమంత్, అశోక్, శీన, మాలాపురం రామాంజనేయులు, శ్రీనివాసులు, గురుదాస్ తదితరులు పాల్గొన్నారు.

సీఎస్ఐ చర్చి బిల్డింగ్‌ను ప్రారంభించిన మంత్రి

విశాలాంధ్ర-ఉరవకొండ: రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ఆదివారం ఉరవకొండలో సిఎస్ఐ చర్చ్ బిల్డింగును రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఎమ్మెల్సీ శివరామి రెడ్డి కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చర్చి పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ల ప్రమీల జోసెఫ్ తో పాటు చర్చి కార్యదర్శి షాహిన్, కమిటీ సభ్యులు ఎం భాస్కర్ బాబు, సాకే భాస్కర్, దేవిడ్, లాలూ ప్రసాద్, విజయ్ కుమార్, మోహన్ బాబు, సుధాకర్ వీరితోపాటు టిడిపి, వైసిపి పార్టీకి చెందిన నాయకులు కార్యకర్తలు, క్రిస్టియన్ సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

విశాలాంధ్ర-ఉరవకొండ: వజ్రకరూరు మండల కేంద్రంలో కాటా వెంకటప్ప జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం 1996-2000 బ్యాచ్ పూర్వ విద్యార్థుల అపూర్వ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన గురువులు రామకృష్ణ, త్యాగరాజు, శకుంతలమ్మ, అంజనేయులు, నాగ రత్నమ్మ, ఐక్రియ, చంద్రశేఖర్, రమణ పేక్షావలిలను పూర్వ విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గురువులు మాట్లాడుతూ తాము చదువు చెప్పిన విద్యార్థులు ప్రస్తుతం వివిధ హోదాల్లో ఉండడం అభినందనీయం అన్నారు. అనంతరం పూర్వ విద్యార్థులు తమకు చదువు నేర్పిన గురువులను ఘనంగా సత్కరించారు. అనంతరం తమ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు అనంతరం అందరూ కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు స్వర్ణలత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తాగు నీరు వృథా.. పంటలకు ముప్పు



విశాలాంధ్ర-బొమ్మనహాళ్: మండలంలోని దర్గాహొన్నూరు గ్రామ సమీపంలో శ్రీరామిరెడ్డి తాగునీటి పైపులైను ద్వారా నీరు వృథాగా బయటకు పోతున్నాయి. సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాగునీటి పైపులైను నుంచి నీరు నిరంతరం వృథాగా ప్రవహిస్తూ రైతుల పంట పొలాల్లోకి చేరుతోంది. హేర్వాల్వు సరైన మరమ్మతులు లేకపోవడంతో రెండు ఇంచుల నీరు బయటకు పోతు పొలాల్లోకి చేరి పం టలను దెబ్బతీస్తోంది. ఈ సమస్యపై రైతులు పలుమార్లు సంబంధిత అధికారులకు సమాచారం ఇచ్చినా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాగునీరు ఇలా వృథా కావడమే కాకుండా, పొలాలు తడిసి పంటలు తడసిపోతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే శ్రీరామిరెడ్డి తాగునీటి పథకంలోని లీకేజీలను సరిచేసి నీటి వృథాను అరికరాలని రైతులు, గ్రామసులు కోరుతున్నారు.

ఉచిత వైద్య శిబిరం

విశాలాంధ్ర-బెలుగుప్ప: మండల పరిధిలోని తగుపర్తి గ్రామంలో మ్యాగ్నస్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ అనంతపురం వారు రూరల్ ఫ్రీ హెల్త్ చెకప్ క్యాంప్, గ్రామ సర్పంచ్ కొనంకి. మౌనిక ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. వైద్య చికిత్సల కోసం దూర ప్రాంతాలకు పోకుండా వేలా ది రూపాయలు ఖర్చు పెట్టుకోలేక ఇబ్బందులకు గురి అవుతున్న గ్రామీణులకు మంచి అవకాశం అని కార్డియాలజి నిపుణులు డాక్టర్ రిషిప్రసాద్ తెలిపారు, దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారికి, అనంతపురంలో ఉన్న వారి ఆసుపత్రి లో డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ క్రింద వైద్యం చేస్తామన్నారు. వారి వైద్య బృందం సభ్యులు డాక్టర్ రితిన్ చౌదరి, ఫిజీషియన్, లిఖిత ఎంబిబిఎస్ వారు, గ్రామంలో వైద్య పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా పంపిణీ చేశారు, కార్యక్రమంలో, మాజీ సింగిల్ విండో అధ్యక్షులు దబ్బర. వెంకటనాయుడు, సీనియర్ నాయకులు, రాధాకృష్ణ, మురుసు మురుసు జయప్ప పాల్గొన్నారు.

17న విశ్రాంతి ఉద్యోగుల దినోత్సవం

విశాలాంధ్ర-ఉరవకొండ : ఈనెల 17న స్థానిక ప్రభుత్వ విశ్రాంతి ఉద్యోగుల కార్యాలయంలో జాతీయ విశ్రాంతి ఉద్యోగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నట్లు విశ్రాంతి ఉద్యోగుల సంఘం అధ్యక్షులు కె.కృష్ణప్ప తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ విశ్రాంతి ఉద్యోగుల జాతీయ దినోత్సవంతో పాటు సర్వసభ్య సమావేశాన్ని కూడా నిర్వహిస్తున్నామన్నారు. 70 సంవత్సరాలు నిండిన విశ్రాంతి ఉద్యోగు లకు ఘనంగా సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు.

వర్ధంతి సందర్భంగా అన్నదానం

విశాలాంధ్ర-పెద్దవడుగూరు: మండల కేంద్రంలోని, కమలపాడు రోడ్డు, రాఘవేంద్ర కాలనీలో ఉన్న అగాపే ఆశ్రమంలో కీ"శే' తంగసాని విజయభాస్కర్ రెడ్డి 14వ వర్ధంతి జ్ఞాపకార్థం ఆదివారం ఆయన భార్య తంగసాని లక్ష్మీదేవి, కొడుకు మహర్షి రెడ్డి, కోడలు, కూతురు మౌనిక రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి వృద్ధాశ్రమంలో అన్నదానం నిర్వహించారు. ఆశ్రమ నిర్వాహకులు బత్తల ప్రసాద్, ఆశ్రమంలోని వారంతా వారి కుటుంబానికి కృతజ్ఞతలు తెలిపారు.

ట్రాన్స్‌ఫార్లలో రాగి కాపర్ వైర్ చోరీ

విశాలాంధ్ర-బెలుగుప్ప: మండల పరిధిలోని రామసాగరం గ్రామంలో శనివారం రాత్రి వ్యవసాయ తోటల్లోనే విద్యుత్ ట్రాన్స్ఫర్మర్ లలో శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులచే రాగి కాపర్ వైర్ ను దోచుకెళ్లారు. అధికారులు పోలీసులు తెలిపిన వివరాలు మేరకు రామ సాగరం గ్రామంలో మూడు ట్రాన్స్ఫర్మర్ల ధ్వంసం చేసి ట్రాన్సుఫార్మర్ల లోని కాపర్ వైర్‌ను ఎత్తుకు వెళ్ళినట్లు తెలిపారు. వీటిలో ఒకటి ప్రభుత్వం చెందిందని, మరో రెండు రైతులు అన్నారు. ఒక్కొక్క ట్రాన్స్ఫారంలో 40 వేలు రూ విలువ చేసే రాగి కాపర్ వైరు ఉంటుందని పోలీసులకు విద్యుత్ అధికారులు ఫిర్యాదు చేశారు. ట్రైనీ ఎస్సై మహేష్ సిబ్బంది నాగభూషణం వెళ్లి సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

క్రీడలు విజయ శిఖరాలకు నాంది.. శ్రీకాంత్‌రెడ్డి

విశాలాంధ్ర-జేఎన్టీయూఏ: క్రీడలు విజయ శిఖరాలకు నాంది అని శ్రీ బాలాజీ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్ యాజమాన్య ప్రతినిధి శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆరవ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ యోగాసనం ఛాంపియన్‌షిప్ 2025-26లో పివికెకే ఇంజనీరింగ్ కళాశాలలో జాతీయస్థాయి యోగాసనా ఛాంపియన్‌షిప్ నిర్వహించిన పోటీల్లో మొత్తము 10 విభాగాల్లో 20 మంది ఎన్నికయ్యారు. మహారాష్ట్రలోని సంఘం నీరులో జరుగుతున్న పోటీలకు అర్హత సాధించి, గోల్డ్ మెడల్ సంపాదించారు. అనకాపల్లి నుంచి వచ్చిన బాలబాలికలు మొత్తం ఏడుగురు జాతీయస్థాయి యోగాసనా చాంపించి పోటీకి అర్హత సంపాదించారు. అదేవిధంగా సత్యసాయి జిల్లా నుంచి రిథమిక పేరుకి ఎస్.లక్ష్మీ నారాయణచారి గుర్రం మహేదరు అర్హత సంపాదించారు. ఎన్టీఆర్ జిల్లా నుండి ముగ్గురు అభ్యర్థులు రాష్ట్రస్థాయి పోటీలలో గోల్డ్ మెడల్ సంపాదించి జాతీయస్థాయి ఛాంపియన్షిప్ పోటీలకు అర్హత సంపాదిం చారు. కృష్ణా జిల్లా వారు ఇద్దరు, ఈస్ట్ గోదావరి జిల్లా నుండి ఇద్దరు , తిరుపతి జిల్లా నుంచి ఇద్దరు, కాకినాడ విశాఖ పట్నం జిల్లా నుంచి ఒక్కొక్కరు చొప్పున జాతీయస్థాయి యోగాసనా ఛాంపియన్ పోటీలకు అర్హత అర్హత సాధించిన విద్యార్థులకు, యాజమాన్య ప్రతినిధి శ్రీకాంత్‌రెడ్డి, బిఎస్ఎన్ఎల్ డీజీఎం డి.బాలగంగాధర్‌రెడ్డి, కమ్మభవన్ అధ్యక్షులు నాగన్న, యోగసన స్పోర్ట్స్ అసోసియేషన్ పట్రోన్ కెవి రమణ, అధ్యక్షులు ఎం.రాజా శేఖర్‌రెడ్డి, కాంపిటీషన్ డైరెక్టర్ దుర్గరావు, పిల్లలకు బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి ఈన్ మారుతీ ప్రసాద్, వై.ఆంజనేయులు, మల్లికార్జున, నాగభూషణ, మహేష్ దివాకర్, సాప్ అబ్జర్వర్ నాగేంద్ర, అసోసియేషన్ అధ్యక్షులు ఎం.రాజశేఖర్ రెడ్డి, ఆర్గనైసింగ్ కార్యదర్శి దివాకర్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల కలయిక..

విశాలాంధ్ర, కూడేరు : మండలకేంద్రం లోని జెడ్ పి. హైస్కూల్ 1981 - 1986 "బ్యాచ్ పూర్వ విద్యార్థులు కలిసి తెలుగు పండిట్ కృషా?రెడ్డిని ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో "పూర్వ విద్యార్థులు" కలుసుకొని వారి కుటుంబాలతో పరిచయాలు చేసుకొని యోగ క్షేమాలు అడిగి తెలుసు కొన్నారు

నీళ్ల ట్యాంకు ప్రారంభం..

విశాలాంధ్ర-యాడికి: మండల కేంద్రంలోని భద్రావతి భావనారాయణ స్వామి ఆలయ సమీపంలో మార్కండేయ స్వామి పద్మశాలీయుల కులస్తుల ఆధ్వర్యంలో ఆదివారం నీళ్ల ట్యాంకును ప్రారంభించారు. భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేశామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు జానపాటి గురుమూర్తి స్వామి, వైస్ ప్రెసిడెంట్ కాలవ శ్రీనివాసులు, కోశాధికారి కుంటు మల్ల కృష్ణ రంగ పనిబాబు, సెక్రటరీ లింగంపల్లి నాగ రంగయ్య, జనరల్ సెక్రటరీ పోకూరు జయప్రసాద్ చిట్టి పాల్గొన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు వద్ది రాజశేఖర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో జానపాటి గురుప్రసాద్, జక్కా రామయ్య, కాలవ జనార్ధన, శిరసాల దామోదర్, శిరసాల సురేష్ బాబు, జానుపాటి శ్రీనివాసులు, జానపాటి నాగేష్, తిరుపతయ్య, యుగంధర్ పాల్గొన్నారు.

విశాలాంధ్ర శ్రీ సత్యసాయి
www.visalaandhra.com
కర్నూలు, సోమవారం 15, డిసెంబర్ 2025

విజయవంతంగా ఓపెన్ చెస్ టోర్నమెంట్..

విశాలాంధ్ర-ధర్మవరం : పట్టణంలోని కొత్తపేటలో గల శ్రీ సీతా రామాంజనేయ స్వామి కళ్యాణ మండపంలో డాక్టర్ ఎన్ నాగమణి మెమోరియల్ ఆల్ ఇండియా ఓపెన్ చేసి టోర్నమెంట్ క్రీడలు ఈనెల 13వ తేదీ 14వ తేదీ రెండు రోజులపాటు దిగ్విజయంగా చెస్ క్రీడలు ముగిశాయి. ఈ చెస్ టోర్నమెంట్ యువర్ ఫౌండేషన్ ధర్మవరం, హైవే చెస్ అకాడమీ అనంతపురం వారి ఆధ్వర్యంలో జరిగాయి. ఈ చెస్ టోర్నమెంట్ ఆర్గనైజింగ్ అధ్యక్షులుగా చాంద్ బాషా, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ కార్యదర్శి ఈశ్వరప్ప నేతృత్వములో జరిగాయి. అనంతరం చాంద్ బాషా, ఈశ్వరప్ప, హాయ్ బ్రో చెస్ అకాడమీ అనంతపురం టోర్నమెంట్ డైరెక్టర్ జాకీర్ హుస్సేన్ మాట్లాడుతూ ఈ ఆల్ ఇండియా ఓపెన్ చేసి టోర్నమెంటులో 236 మంది ఇచ్చేసి క్రీడాకారులు రెండు రోజులుగా ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను కనబరిచారని తెలిపారు. మొదటి రోజు 6 రౌండ్లు చివరి రోజున మూడు రౌండ్లు వెరసి 9 రౌండ్ల చెస్ టోర్నమెంట్ జరిగిందని తెలిపారు. ఈ చెస్ట్ టోర్నమెంటులో బాలుర, బాలికలకు వేరువేరుగా క్రీడలు నిర్వహించడం జరిగిందన్నారు. ఈ చెస్ క్రీడా టోర్నమెంట్లో ఫస్ట్ ర్యాంక్ ఓ. కుషాల్ మనీ క్రీడాకారుడు 1914 రేటింగులో 81/2 పాయింట్లు కైవసం చేసుకున్నారని తెలిపారు. వీరికి ట్రోఫీతో పాటు 15 వేల రూపాయలు నగదును అందించడం జరిగిందన్నారు. అదేవిధంగా రెండవ ర్యాంకు జే.మల్లేశ్వరరావు రేటింగ్ 1837లో 8 పాయింట్లు కైవసం చేసుకోగా రూ.10 వేల రూపాయల నగదు ట్రోఫీ అందించడం జరిగిందన్నారు. తదుపరి మూడవ ర్యాంకుగా వై.లాలిత్య రేటింగ్ 1531లో 8 పాయింట్లు సాధించగా ట్రోఫీతోపాటు రూ.8 వేల నగదును ముఖ్య అతిథుల చేతుల మీదుగా పంపిణీ చేశామని తెలిపారు. మొత్తం ఫస్ట్ ప్రైజ్ నుంచి 35వ ప్రైజ్ వరకు రూ.1,25,000 విజేతలైన చెస్ క్రీడాకారులకు అందించడం జరిగిందని తెలిపారు. ఈ చెస్సు టోర్నమెంటులో వసతి, భోజనం తదితర సౌకర్యాలు యువర్స్ ఫౌండేషన్ వారు కల్పించడం జరిగిందన్నారు. ముఖ్యఅతిథిగా ఏపీ స్టేట్ చెస్ అసోసియేషన్ కార్యదర్శి సుమన్, రవి ప్రకాష్, ఐఎంఏ అధ్యక్షులు వాసుదేవరెడ్డి హాజరు కావడం జరిగిందన్నారు. ఆర్గనైజర్గా ఈశ్వరయ్య, ఆర్గనైజింగ్ అధ్యక్షులుగా చాంద్ బాషా వ్యవహరిస్తూ, మొత్తం చెస్ క్రీడాకారులను చెస్ అకాడమీ టోర్నమెంట్ డైరెక్టర్ జాకీర్ హుస్సేన్ పర్యవేక్షణ చేస్తూ విజయవంతంగా చేయుటలో సహకరించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో యువర్ ఫౌండేషన్ అధ్యక్షులు షీలా నాగేంద్ర, కార్యదర్శి జయరాం, డాక్టర్ సుబ్బారావు, సత్రశాల మల్లికార్జున, కౌన్సిలర్ కేత లోకేష్, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం రూ.8 వేలతో కంది కొనుగోళ్లు..

15 నుంచి రైతులు పేర్లు నమోదు చేసుకోవాలి

ఏపీ మార్క్ ఫెడ్ జిల్లా మేనేజర్ ఎస్.గీతమ్మ

విశాలాంధ్ర-పుట్టపర్తి: రాష్ట్ర ప్రభుత్వం కంది పంట రైతులకు కనీస మద్దతు ధర 8000 తో కొనుగోలు చేయనున్నట్లు ఏపీ మార్క్ ఫెడ్ జిల్లా మేనేజర్ గీతమ్మ తెలిపారు. ఆదివారం ఆమె ప్రకటన విడుదల చేస్తూ జిల్లాలో కంది పండించిన రైతులకు ప్రభుత్వం కనీస మద్దతు ధర రూ.8 వేల పై కంది కొనుగోలు చేయుటకు సదరు మండలాలలో ఆర్.యస్.కే లలో పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. కావున జిల్లాలో కంది పంట పండించిన ప్రతి రైతు తమ పేర్లను తమ తమ ఆర్.యస్.కేల్లో ఈ నెల 15 నుండి నమోదు చేసుకోవాలని కోరారు.

రోడ్డుపై మట్టి శుభ్రం చేసిన యువత..



విశాలాంధ్ర-నంబులపూలకుంట : మండల పరిధిలోని తాటిమానుగుంత గ్రామ సమీపంలో ఇటీవల కురిసిన వర్షాల కారణంగా రోడ్డుపై మట్టి చేరి ద్విచక్ర వాహనదారులు అదుపు తప్పి ప్రమాదాలకు గురవుతున్న పరిస్థితి నెలకొంది. ఈ పరిస్థితిని గమనించిన తాటిమానుగుంత గ్రామ యువత "మన రోడ్డు మన బాధ్యత" అనే నినాదంతో ఆదివారం స్వచ్ఛందంగా ముందుకు వచ్చారు. గడ్డపారలు పట్టుకుని రోడ్డుపై పేరుకుపోయిన మట్టిని పూర్తిగా తొలగించి రహదారిని శుభ్రం చేశారు. ఈ సందర్భంగా యువత మాట్లాడుతూ, తాటిమానుగుంత నుండి ఎన్‌పీకుంటకు వెళ్లే వాహనాలు ఇదే ప్రధాన రహదారిని వినియోగిస్తున్నాయని, ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు తమ వంతుగా చిన్న చిన్న పనులు స్వయంగా చేపడుతున్నామని తెలిపారు. భవిష్యత్తులో కూడా గ్రామాభివృద్ధికి అందరూ కలిసి పనిచేస్తామని పేర్కొన్నారు.

గంజాయి మత్తులో ఆకతాయిల హల్చల్

విశాలాంధ్ర-లేపాక్షి: నిత్యం గంజాయి మద్యం మత్తులో ఊగుతూ తూగుతూ జాతీయ రహదారిలో రోజు సింగిల్వీల్ డ్రైవ్ చేస్తు ఎన్నో ప్రమాదాలకు కారకులవుతున్న సింగిల్ వీల్ డ్రైవ్ ఆకతాయిలు ఆదివారం మధ్యాహ్నం లేపాక్షి సమీపంలోని రహదారిలో హల్చల్ చేసారు. గమనించిన విలేకరి జాతీయ రహదారిలో సింగిల్ వీల్ డ్రైవ్ చేస్తున్న యువకులను ప్రశ్నించడానికి ప్రయత్నం చేయగా అప్పటికే మత్తులో వున్న ఆకతాయిలు మీరు ఎవరు. రోడ్డుపై వచ్చేవారు వస్తారు. పోయేవారు పోతారు.. మీరేమైన మమ్ములను పట్టుకోవడానికి పోలీసులా.. వారే పట్టించుకోరు అంటు దౌర్జన్యానికి దిగారు. ఈ విషయాన్ని చిత్రీకరించడానికి ప్రయత్నించిన విలేకరిపై దాడి చేసారు. రహదారి పక్కనే వున్న రైతులు గట్టిగా కేకలు వేసి నిలువరించే, ప్రయత్నం చేయగా విలేకరి వాహనానికి వున్న తాళాలును తీసుకుని వేగంగా వెళ్లిపోయారు. హిందూపురం నుండి రోజూ కొంతమంది ఆకతాయిలు వాహనా లతో కొట్నూరు, చోల సముద్రం, గలిబిపల్లి క్రాస్ నుండి లేపాక్షి పిల్లిగుండ్ల కాలనీ వరకు ప్రతి రోజు అతి వేగంతో సింగిల్ వీల్ డ్రైవ్ చేస్తు పక్కన వెళ్లే ప్రయాణికులకు భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. కొద్ది రోజులుగా ఆకతాయిలు రహదారుల్లో విచక్షణ రహితమైన వేగంతో విన్యాసాలు చేయడం చూసిన స్థానికులు భయభ్రాంతులకు గురికావడమే కాకుండా వారిని నిలువరించే ప్రయత్నం చేసిన సింగిల్ వీల్తోనే డ్రైవ్ చేస్తూ సవాళ్లు విసరడంపై లేపాక్షిలో చర్చని అంశమే అయింది ఇప్పటికైన పోలీసులు అప్రమత్తమై ఇలాంటి సంఘనలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా వుంది.

కర్ణాటక వాసి హత్య కేసు ఛేదింపు.. నిందితుల అరెస్టు

విశాలాంధ్ర-పుట్టపర్తి: కర్ణాటక వాసి హత్య కేసులో జిల్లా పోలీసులు ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు ఎస్పీ సతీష్ కుమార్ తెలిపారు. ఆదివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ భూమి వివాదాలతో పాటు తన అన్న కూతురుతో చెప్పుతో కొట్టించాడన్న అవమానం భరించలేక పగతో రగిలిపోయి కర్ణాటక ప్రాంతానికి చెందిన ముత్తప్ప అనే వ్యక్తిని హత్య చేసినట్లు గుర్తించారు. అమడగూరు పోలీస్ స్టేషన్ పరిధిలో సెప్టెంబర్ 4వ తేదీ న కర్ణాటక ప్రాంతానికి చెందిన ముత్తప్ప అనే వ్యక్తి హత్య కేసుకు సంబంధించి దర్యాప్తు చేపట్టిన పోలీసులు సురేష్, సోమశేఖర,ఆనంద అనే నిందితులను అరెస్టు చేశారన్నారు. సురేష్‌కు ముత్తప్పకు భూమి తగాదాలు ఉండడం, సోమశేఖర్ అని ముత్తప్ప అన్న కుమార్తెతో చెప్పుతో కొట్టించాడన్న కసితో ఆనందతో కలిసి ముగ్గురు పథకం రచించారన్నారు.ఈ ఏడాది సెప్టెంబర్ తొమ్మిది న రాత్రి 8.30 గంటల సమయంలో అమడగూరు మండలం ఆకులవారిపల్లి శివారులో మృతుడు ముత్తప్పపై ఇనుప రాడ్లతో దాడి చేసి తలపైన కొట్టి, ఎడమ దవడ కింది భాగాన పొడిచి హత్య చేసి పరారయ్యారన్నారు ముఖ్యంగా ప్రతి ఒక్కరూ సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని వీటివల్ల నేరాలకు పాల్పడినప్పుడు నిందితులను గుర్తించేందుకు వీలవుతుందన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల, షాపుల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని జిల్లా ప్రజలకు ఎస్పీ సూచించారు. కేసును చేదించడంలో చేకచక్యంగా వ్యవహరించిన సిఐ నరేందర్ రెడ్డి ఓడి చెరువు పోలీసులను ఎస్పీ అభినందించారు. పట్టణ డిఎస్పి విజయ్ కుమార్, ఓడి చెరువు ఎస్ఐ మల్లికార్జున రెడ్డి పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కుక్కల నుండి ప్రజలకు రక్షణ కల్పించాలి..

వ్యకాసం కార్యదర్శి కదిరప్ప

విశాలాంధ్ర-కదిరి : కుక్కల దాడి నుండి ప్రజలకు రక్షణ కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘ కార్యదర్శి కదిరప్ప పేర్కొన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో అన్ని వార్డుల్లో పెరిగిపోతున్న కుక్కల బెడద ఎక్కువై బాబోయ్... వీధి కుక్కలు దొరికితే వదలవు పిక్కలు అన్న విధంగా మారిందన్నారు. అభం శుభం తెలియని చిన్నారులు కుక్కకాటుతో ఆసుపత్రి పాలు అవుతున్నారన్నారు. పట్టణంలో రోజు ఎక్కడో ఒక చోట వృద్ధులు, పసి పిల్లలు కుక్కకాటుకు బలి అవుతున్నా పాలకులు, అధికారులు తమకేమి పట్టనట్లు వ్యవహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలో ఎక్కువ శాతం ఆర్టీసీ డిపో, రైల్వే స్టేషన్, చికెన్ సెంటర్, ఆమీన్ నగర్, నిజాం వలి కాలనీ ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో వీధి కుక్కలు తిరుగుతుండటంతో ప్రజలు బయటకు రావాలంటే భయపడే పరిస్థితి నెలకొందన్నారు.మున్సిపల్ అధికారులు తక్షణమే స్పందించాలని లేని పక్షంలో ప్రజా ఉద్యమానికి సిద్ధం అవుతామని హెచ్చరించారు.

కర్ణాటక వాసి హత్య కేసు ఛేదన

ముగ్గురు నిందితుల అరెస్ట్

విశాలాంధ్ర-అమడగూరు: భూమి వివాదాలు, అవమానంతోనే హత్య చేసినట్లు దర్యాప్తులో వెల్లడి. ప్రత్యేక పోలీస్ బృందాల గాలింపుతో నిందితుల పట్టివేత.అమడగూరు పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన కర్ణాటక వాసి ముత్తప్ప హత్య కేసును పోలీసులు ఛేదించారు. ఈ కేసులో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసినట్లు జిల్లా ఎస్పీ శ్రీ ఎస్. సతీష్ కుమార్ ఐపీఎస్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు భూమి వివాదాలతో పాటు, తన అన్న కూతురుతో చెప్పుతో కొట్టించాడన్న అవమానాన్ని భరించలేక నిందితులు పగతో హత్యకు పాల్పడ్డారని విచారణలో తేలింది. 03-09-2025 రాత్రి ఆకులవారిపల్లి శివారులో ఇనుప రాడ్లతో దాడి చేసి ముత్తప్పను హత్య చేసినట్లు పోలీసులు వెల్లడించారు. నిందితులను మహమ్మదాబాద్ గ్రామంలో ఆదివారం అరెస్టు చేసి రిమాండ్ కు తరలించామన్నారు. నేరాలకు పాల్పడిన వారిని ఎక్కడున్నా వదిలిపెట్టమని, చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ హెచ్చరించారు.సమావేశంలో డిఎస్పి విజయ్ కుమార్, సిఐలు, నరేంద్ర రెడ్డి, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు శ్రీనివాసులుపాల్గొన్నారు.

కంటి వెలుగు ప్రసాదించడమే మా లక్ష్యం

విశాలాంధ్ర-ధర్మవరం: పేద ప్రజలకు కంటి వెలుగును ప్రసాదించడమే మా లక్ష్యము అని రోటరీ క్లబ్ అధ్యక్షుడు నాగభూషణ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో (వన్ టౌన్ పోలీస్ స్టేషన్ ఎదురుగా) ఉచిత కంటి ఆపరేషన్ల వైద్య శిబిరం రోటరీ క్లబ్, శంకరా కంటి ఆసుపత్రి బెంగళూరు, జిల్లా అంతత్వ నివారణ సంస్థ వారి సహకారంతో నిర్వహించారు. ఈ శిబిరానికి దాతగా కీర్తిశేషులు కోరా రామ సుబ్బారెడ్డి తమ్ముడు కూర రామిరెడ్డి వారి కుటుంబ సభ్యులు వ్యవహరించారు. 110 మంది కంటి రోగులు పాల్గొనిగా వారికి శంకరా కంటి ఆసుపత్రి కంటి డాక్టర్ అబీద్ వైద్య చికిత్సలు అందించగా 75 మంది కంటి ఆపరేషన్లకు ఎంపిక చేశారు. కంటి ఆపరేషన్ కు ఎంపికైన వారికి ఉచిత రవాణా, ఉచిత వసతి, ఉచిత భోజనం, ఉచిత ఆపరేషన్లు నిర్వహించబడునని తెలిపారు. కంటి నిపుణులు సలహాలతో కళ్ళలలో ఉచిత లెన్స్ కూడా అమర్చబడునని తెలిపారు. ఆపరేషన్ అనంతరం ఉచితంగా అద్దాలు ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ కోశాధికారి నరేందర్ రెడ్డి, క్యాంపు చైర్మన్ దాస్, సాంస్కృతిక మండలి అధ్యక్షులు సత్రశాల ప్రసన్నకుమార్, గర్రె రమేష్ బాబు, శ్రీనివాస్ రెడ్డి, జయసింహ, శివయ్య, సుదర్శన్ గుప్తాతో పాటు శంకరా కంటి ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

కార్యకర్త మృతికి సంతాపం

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని 32 వ వార్డు సత్య సాయి నగర్కు చెందిన వైఎస్సార్సీపీ కార్యకర్త కారుపోతల సోము (36) ప్రమాదవశాత్తు మృతి చెందడం జరిగింది. సమాచారాన్ని అందుకున్న మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి సోదరుడు వెంకట కృష్ణారెడ్డి అక్కడికి చేరుకొని పూలమాలవేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ కార్యకర్త కుటుంబానికి వైఎస్ఆర్సిపి పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికను రెవెన్యూ డివిజన్ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆదివారం ఆర్డీవో మహేశ్ తెలిపారు. ఇప్పటికే దీర్ఘకాలికంగా పెండింగ్లో ఉన్న సమస్యలను కలెక్టర్ ఆదేశాల మేరకు పరిష్కరించడం జరిగిందని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం కొరకు ఈ వేదికలో డివిజన్ వివిధ విభాగాల అధికారులు హాజరవుతారని తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఈ ప్రజా సమస్యల పరిష్కార వేదికను డివిజన్ ప్రజలు తప్పకుండా సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను పరిష్కరించుకోవాలి అని తెలిపారు.

పెయ్య దూడ కోసం ప్రత్యేక వాక్సిన్

విశాలాంధ్ర-ధర్మవరం: రైతులు పాడి సంపదను పెంపొందించుకోవడానికి ప్రభుత్వ ఆదేశాల మేరకు పాడి పశువుల్లో పెయ్య దూడ పుట్టుట కోసం ప్రత్యేక వ్యాక్సిన్ను వేస్తున్నామని వెటర్నరీ డాక్టర్ శేఖర్ తెలిపారు. ఆదివారం మాట్లాడుతూ ఈ వ్యాక్సిన్ రూ.500లు ఉంటుందని, ఇందులో రైతు భాష 150 రూపాయలు చెల్లించితే వ్యాక్సిన్ అందుబాటు లోకి వస్తుందని తెలిపారు. వ్యవసాయం తర్వాత రైతులు లాభసాటిగా నడవాలి అంటే పాడి సంపదను నేడు ప్రభుత్వం గుర్తించి ఈ కార్యక్రమం చేపట్టిందని తెలిపారు. పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఘనంగా హిందూ సమ్మేళనం

విశాలాంధ్ర-పరిగి : ఆర్ఎస్ఎస్ 100 సంవత్సరాల సందర్భంగా పాత పంచాయతీ ఆఫీస్‌లో గల శ్రీ లక్ష్మమ్మ ఆలయంలో ఆదివారం హిందూ సమ్మేళనం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కోన కణ్వాశ్రమం పీఠాధిపతులు శ్రీ దత్తా నందగిరి స్వామి పాల్గొని ఆశీః ప్రసంగం చేశారు. ప్రైవేట్ స్కూలు పిల్లలు భరతనాట్యము, వందేమాతరం, సాంస్కృతిక కార్యక్రమాల భజన బృందం వారిచే భజన కార్యక్రమం నిర్వహించారు. స్వామీజీ మాట్లాడుతూ హిందువులంతా సంఘటితమై పాటుపడితే దేశం పరమ వైభవ స్థితిని మరలా పొందుతుందని పేర్కొన్నారు. ప్రధాన వక్తగా విచ్చేసిన ఆర్ఎస్ఎస్ గ్రామ వికాస్ ప్రాంత ప్రముఖ్ తిరుపతయ్య మాట్లాడుతూ యువత సరైన మార్గంలో నడవడం ద్వారానే ఈ దేశం అభివృద్ధి పథంలో దూసుకెళ్తుంది. మతమార్పిడులు ఏమాత్రం ఆమోద యోగ్యం కాదన్నారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయవాది పరిగి వేణుగోపాలరావు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చొరవతో సరదాగా గడిపిన ఎంజెపీ విద్యార్థులు

విశాలాంధ్ర-గుడిబండ: మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు ఎంజెపి జూనియర్ కళాశాల పాఠశాల సందర్శించిన సమయంలో విద్యార్థులు ఆటవిడుపు కోసం విద్యార్థులు కోరిన కోరికను నెరవేర్చిన ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు నెరవేర్చారు. గతంలో కళాశాల కు వెళ్ళినప్పుడు విద్యార్థులు ఆట విడుపు కోసం సెలవు రోజున బయటకు తీసుకువెళ్లాలని కోరడంతో విద్యార్థుల కోరిక మేరకు ఎమ్మెల్యే గుడిబండ హనుమాన్ థియేటర్ యాజమాన్యంతో అఖండ 2 చలనచిత్రాన్ని వీక్షించేందుకు వెళ్లి రావడానికి ప్రత్యేక చొరవ తీసుకుని బస్సు సౌకర్యం కల్పించి క్షేమంగా తిరిగి కళాశాల పాఠశాలకు చేరుకునే విధంగా ఏర్పాటు చేశారు. కళాశాల విద్యార్థులు మాట్లాడుతూ గతంలో ఎంతమంది ఎమ్మెల్యేలు ఉన్న మా పాఠశాల వైపు చూడలేకపోయారు కానీ ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు ఇప్పటికే దాదాపు 15 సార్లు మా పాఠశాలకు వచ్చి ఉపాధ్యాయులతో మాట్లాడి నాణ్యమైన విద్య బోధించాలని. మెనూ ప్రకారం భోజనం అందించాలని పర్యవేక్షించడం పట్ల ఆయనకు ధన్యవాదాలు తెలిపారు. మడకశిర నుంచి గుడిబండ హనుమాన్ థియేటర్ వరకు ఎమ్మెల్యే ఆదేశాలతో ఎమ్మెల్యే వ్యక్తిగత సహాయకుడు రవికుమార్, కళాశాల ప్రిన్సిపాల్ పాఠశాల ఉపాధ్యాయులు లెక్చరర్స్ రాష్ట్ర కుంచిటిగవక్కలిగ కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మీనారా యణ, ఎమ్మెల్యే వ్యక్తిగత సహాయకులు, గుడిబండ టిడిపి మండల అధ్యక్షులు లక్ష్మీనర సప్ప, టిడిపి ప్రధాన కార్యదర్శి శ్రీనాథ్ మూర్తి వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షులు మద్దనకుంటప్ప జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు మంజునాథ్ జిల్లా వీర శైవ లింగాయత్ అధ్యక్షులు దుర్గేష్ ఎంపీటీసీ వనజశశిధర్ పాల్గొన్నారు.

17న టీడీపీ విస్తృతస్థాయి సమావేశాన్ని జయప్రదం చేద్దాం

విశాలాంధ్ర-కదిరి: 17న జరిగే టీడీపీ విస్తృతస్థాయి సమావేశాన్ని జయప్రదం చేద్దామని ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ(17బుధవారం)మదనపల్లి రోడ్డులోని పీవీఆర్ గ్రాండ్‌లో జరిగే టీడీపీ నియోజకవర్గ సమావేశంలో పలు ముఖ్యమైన అంశాలపై చర్చ ఉంటుదన్నారు. 30న జరిగే ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వారా దర్శనార్థం జిల్లా నలుమూలల నుండే కాకుండా పొరుగు రాష్ట్ర నలుమూలల నుండి వచ్చే భక్తుల కోసం ఎటువంటి ఆటంకాలు లేకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తామని తెలిపారు.

నిరాశ్రయులకు దుప్పట్లు పంపిణీ

విశాలాంధ్ర-కదిరి టౌన్ : కదిరి పట్టణంలోని శ్రీ శాంతినికేతన్ హై స్కూల్ అధినేత మొమీన్ సలీం భాష అధ్వర్యంలో అనాథ వృద్ధులకు, యాచకులకు, నిరాశ్రయులకు ఆదివారం దుప్పట్లు పంపిణీ చేశారు. ప్రతి సంవత్సరం చలికాలంలో డిసెంబర్‌లో ప్రధాన కూడలిలో ఉంటున్న అనాధ వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తామన్నారు. తన సిబ్బందితో వెళ్లి వృద్ధులకు అందరికీ దుప్పట్లు పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

వీధి కుక్కల స్వైర విహారం..

విశాలాంధ్ర-గాండ్లపెంట: మండలంలో వీధి కుక్కల స్వైర విహారం చేస్తున్నాయి. గుంపులుగా కుక్కలు తిరుగుతూ భయాందోళన కల్గిస్తున్నాయి. మండల కేంద్రంలో కదిరి రాయచోటి ప్రధాన రహదారిలో రోడ్లపై తిరుగుతూ చిన్న పిల్లలు, మహిళలు, వృద్ధులు, ద్విచక్ర వాహనాలను, వెంబడించి పరుగు పెట్టిస్తున్నాయి. పగలు, రాత్రి వేళల్లో రోడ్లపైకి గుంపులు గుంపులుగా వచ్చి, రోడ్లపై నుంచి వెళ్లే వారిపై దాడులు చేస్తున్నాయి. గాండ్లపెంట మండలంలోని గతంలో చిన్నారులు వృద్ధులు గాయపడి హాస్పిటల్ పాయలైన ఘటనలు చాలా ఉన్నాయి. ఏదైనా సంఘటన జరిగినప్పుడే స్పందించే అధికారులు తర్వాత పట్టించుకోవడం లేదని ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. అధికారుల స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు వాపోతున్నారు.

సువార్త వేడుకల్లో నిమ్మల శ్రీధర్

విశాలాంధ్ర-గోరంట్ల: పట్టణంలోని రాజీవ్ కాలనీ ప్రాంతంలో గల చర్చిలో పాస్టర్ దినకరన్ ఆధ్వర్యంలో సెమీ గ్రాండ్ క్రిస్మస్ సమరాల్లో భాగంగా ఆదివారం సువార్త వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేడుకల నిర్వాహకుల ఆహ్వానం మేరకు టీడీపీ నాయకులు సమాజసేవకులు నిమ్మల శ్రీధర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వేడుకల్లో నిమ్మల శ్రీధర్ పాల్గొని చర్చి ఫాదర్ ఆశీస్సులు పొందారు. అనంతరం సెమీ గ్రాండ్ క్రిస్మస్ సంబరాలు భాగంగా పేదలకు చీరలు పంపిణీ చేసి తమ సేవాభావాన్ని చాటుకున్నారు. ఈ నేపథ్యంలో చర్చి ఫాదర్ దినకరన్ నిర్వాహకుల చేతుల మీదుగా టిడిపి నేత నిమ్మల శ్రీధర్‌ను ఘనంగా సత్కరించారు. అలాగే వారితోపాటు మాజీ వార్డు మెంబర్ పసుపులేటి శ్రీనివాసులు, మామిడికాయల హరిని సన్మానించారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి..

విశాలాంధ్ర-బుక్కపట్నం: నేటితరం విద్యార్థులు చదువులతో పాటు క్రీడల్లో రాణించాలని టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలో జాతీయస్థాయి హాకీ పోటీలకు ఎన్నికైన క్రీడాకారుడు నవదీప్, వాలీబాల్ సౌత్ జోన్ క్రీడాకారుడు మురళిలను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం క్రీడాకారులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తూ, క్రీడలను ప్రోత్సహిస్తుందని తెలిపారు. గ్రామీణ ప్రాంత క్రీడాకారులు, జాతీయస్థాయిలో రాణించి, తమ సత్తా చాటాలని తెలిపారు. ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డిలు క్రీడలను ప్రోత్సహిస్తూ వారికి అన్ని సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టౌన్ కన్వీనర్ ఎర్రకేశప్ప, పిడి రామకృష్ణ, ఉపాధ్యాయులు తిప్పన్న, రవిచంద్ర, నాయకులు సమకోటి ఈశ్వరయ్య, మంజునాథ్, క్రీడాకారులు పాల్గొన్నారు.

జీవనోపాధిపై అవగాహన సదస్సు

విశాలాంధ్ర-రొద్దం: కోగిర అటవీ ప్రాంతంలో కల్పవల్లి సంస్థ టింబక్టు కలెక్టివ్ సంస్థ ఆధ్వర్యంలో చెన్నె కొత్తపల్లి రామగిరి రొద్దం మూడు మండలాల్లో కలిసి పనిచేస్తున్నది ఆదివారం కోగిర అటవీ ప్రాంతం టింబక్టు కలెక్టివ్, బుష్ కార్యాలయంలో యువతకు జీవనో పాధి అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. పాము కాటు గురైనప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర విషయాలపై అవగాహన కల్పిస్తూ పాము కాటు వేసిన వెంటనే నాటు వైద్యం తెలియని వైద్యం చేయకూడదు దగ్గర్లో ఉన్న ప్రాథమిక వైద్యశాలలకు తరలించు చికిత్స అందజేయవలెను మూఢనమ్మకాలకు బలి కాకూడదు నని తెలియజేశారు కల్పవల్లి సీఈవో చిరంజీవి మాట్లాడుతూ పర్యావరణ లో భాగంగా యువత సంఘటితమై జీవనోపాధి అవకాశాలు కల్పించుకోవాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో యు రవి ముఖేష్ యు సతీష్ బి ఆది జె కిరణ్ మూడు మండలాల చెందిన యువత పెద్దఎత్తున పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడి వ్యక్తి మృతి..

విశాలాంధ్ర-గోరంట్ల: పట్టణంలోని హిందూపురం రోడ్డులో గల మార్కెట్ యార్డ్ సమీపంలోశనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో సిరగం వాండ్లపల్లి గ్రామానికి చెందిన ఉల్లే వెంకటశివ కుమారుడు అశోక్ కుమార్ (30) తీవ్రంగా గాయపడి బెంగళూరులో చికిత్సలు పొందుతూ మృతి చెందడంతో స్వగ్రామంలో విషాద ఛాయలు అమలుకున్నాయి. ఈ నేపథంలో ఆదివారం మృతుని విశ్వగ్రామమైన సిరిగం వాండ్ల పల్లి లో అశోక్ కుమార్ కు అంత్యక్రియలు నిర్వహించారు. మృతునికి భార్య రాణితో పాటు చిన్నారులు సాకేత్, కుర్నల్, కమల్ దీప్ లు ఉన్నారు. మృతుడు అశోక్ కుమార్ ట్రాక్టర్ గ్యారేజ్ వద్దకు వెళ్ళి ద్విచక్ర వాహనం లో వెళు తుండగా పట్టణంలోని మార్కెట్ యార్డ్ సమీపం వద్ద నున్న మోర్ సూపర్ మార్కెట్ ఎదుట ఎదురుగా వెళుతున్న ముగ్గురు యువకులు అతివేగంతో ఒకే ద్విచక్ర వాహనంలో వెళ్తూ సడన్ గా కుడివైపు కు తిరగడంతో వెనక వైపు నుండి వస్తున్న క్షతగాత్రుడు అశోక్ కు తీవ్రగాయాలు అయినట్లు మృతుని బంధువులు తెలియజేశారు. చిన్న వయసులోనే ముగ్గురు పిల్లలకు తండ్రి దూరం కావడంపై అందరికీ కన్నీళ్లు తెప్పించాయి.

30న వైకుంఠ ఏకాదశి మహోత్సవం

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని శ్రీనివాస నగర్లో గల శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో ఈ నెల 30వ తేదీ మంగళవారం ముక్కోటి ఏకాదశి, శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి తీరు కళ్యాణ్ మహోత్సవ వేడుకలను నిర్వహిస్తున్నట్లు ఆలయ అధ్యక్షులు చెన్నం శెట్టి జగదీశ్వర ప్రసాద్, అర్చకులు రాజేష్ ఆచార్యులు, గౌరవ సలహాదారులు మోహన స్వామి తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ ముక్కోటి ఏకాదశి రోజున మూలవిరాట్ కు విశేష పంచామృతాభిషేకము విశేషాలంకరణ, తెల్లవారుజామున రెండు గంటల నుండి వైకుంఠ ద్వారమున శ్రీదేవి భూదేవి సమేత మలయప్ప స్వామి పాకారోత్సవం స్వామి వారిని ద్వారమున వేయింపు చేయించుట, సాయంత్రం శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి తిరు కళ్యాణ మహోత్సవ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. కావున భక్తాదులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ వేడుకలను విజయవంతం చేయాలని వారి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జింక రాజేంద్రప్రసాద్, చెన్నం శెట్టి శ్రీనివాసులు, చెన్నం శెట్టి రమేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మానవసేవే దైవ సేవ..

విశాలాంధ్ర-ధర్మవరం: మానవసేవే దైవ సేవ అవుతుందని రజనీ ట్రస్ట్, రక్త బంధం ట్రస్ట్ వ్యవస్థాపకులు కన్నా వెంకటేష్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ రెండు ట్రస్టుల ద్వారా ధర్మవరం పట్టణ గ్రామీణ ప్రాంతాలలో ఆకలిగొన్న పేదలకు అన్నదానం చేస్తూ ఓ మంచి కార్యక్రమాన్ని చేయుటలో మాకు ఎంతో సంతోషాన్ని ఇస్తోందని తెలిపారు. ఇటువంటి అన్నదాన కార్యక్రమం దాతల సహాయ సహకారంతో నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా 185 వ సారి అన్నదాన కార్యక్రమంలో రైల్వేటేషన్ పరిధిలో 70 మందికి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. దాతల సహాయ సహకారాలు లేనిదే ఏమీ చేపట్టలేమని తెలిపారు. మరింత దాతలు ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు.

సైకిల్ ఉచిత పంపిణీ పట్ల కృతజ్ఞతా ర్యాలీ

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ ఇటీవల ఉచితంగా సైకిళ్ల పంపిణీ చేసినందుకుగాను ఆదివారం పట్టణంలోని జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినీలు కృతజ్ఞతా ర్యాలీను నిర్వహించారు. విద్యార్థినిలు మాట్లాడుతూ ఇంటి నుండి పాఠశాలకు వెళ్లేందుకు మంత్రి సైకిళ్లు ఉచితంగా ఇవ్వడం మా అదృష్టంగా భావిస్తున్నామని, మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

విశాలాంధ్ర అనంతపురం/సత్యసాయి
www.visalaandra.com
కర్నూలు, సోమవారం 15, డిసెంబర్ 2025

క్రీడల్లో రాణించాలి..

విశాలాంధ్ర-బుక్కపట్నం: నేటితరం విద్యార్థులు చదువులతో పాటు క్రీడల్లో రాణించాలని టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలో జాతీయస్థాయి హాకీ పోటీలకు ఎన్నికైన క్రీడాకారుడు నవదీప్, వాలీబాల్ సౌత్ జోన్ క్రీడాకారుడు మురళిలను ఘనంగా సన్మానించారు. కూటమి ప్రభుత్వం క్రీడాకారు లకు అన్ని సౌకర్యాలు కల్పిస్తూ, క్రీడలను ప్రోత్సహిస్తుందని తెలిపారు. గ్రామీణ ప్రాంత క్రీడాకారులు, జాతీయస్థాయిలో రాణించి, తమ సత్తా చాటాలని తెలిపారు. ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డిలు క్రీడలను ప్రోత్సహిస్తూ వారికి అన్ని సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టౌన్ కన్వీనర్ ఎర్రకేశప్ప, పీడీ రామకృష్ణ, ఉపాధ్యాయులు తిప్పన్న, రవిచంద్ర, నాయకులు సమకోటి ఈశ్వరయ్య, మంజునాథ్, క్రీడాకారులు పాల్గొన్నారు.

12వ వేతన సవరణ కమిటీ వెంటనే వేయాలి

- రాష్ట్రోపాధ్యాయ సంఘం

విశాలాంధ్ర బ్యూరో- అనంతపురం: 12వ వేతన సవరణ కమిటీని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే వేయాలని అనంతపురం జిల్లా రాష్ట్రోపాధ్యాయ సంఘం డిమాండు చేసింది. ఆదివారం ఉపాధ్యాయ సమస్యలపై 79వ కౌన్సిల్ సమావేశం సీపీఐ కార్యాలయంలో జరిగింది. సమస్యలపై ఎస్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు మాట్లాడుతూ ఏకీకృత సర్వీసు రూల్స్ అమలు చేయాలి. పదోన్నతులు కల్పించాలని, 2010 కంటే ముందే నియామకమైన ఉపాధ్యాయులకు టెట్ నుండి మినహాయించాలని, 12వ పీఆర్‌సీ కమిషన్ పునరుద్ధరించాలని, 29శాతం ఐఆర్‌ను ప్రకటించాలని, ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లించాలని, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, మోడల్ ప్రాదమిక పాఠశాలలలోగురు ఉపాధ్యాయులను నియమించాలని, మున్సిపల్ ఉపాధ్యాయులకు పీఎఫ్ సౌకర్యం కల్పించాలని, ఉపాధ్యాయులను బోధనకె పరిమితం చేయాలని, గిరిజన సంక్షేమ పాఠశాలల సమస్యలు పరిష్కరించాలని, మోడల్ స్కూల్ టీచర్ల సర్వీస్ రూల్స్ వెంటనే ప్రకటించాలని కోరారు. అర్హత కలిగిన ఎస్‌జిటిలకు ఎస్ఎ పండిట్‌లుగా ప్రమోషన్ కల్పించాలని, ప్రాథమిక విద్య మాతృభాషలోనే జరగాలని, ఉన్నత పాఠశాలలలో తెలుగు, ఇంగ్లీష్ మీడియాలు కొనసాగాలని, హైస్కూల్ ప్లస్ పాఠశాలలను బలోపేతం చేయాలని, ఎంటిఎస్ ఉపాధ్యాయులను రెగ్యులర్ చేయాలని, జెడ్పీ ఉపాధ్యాయులకు జూనియర్ లెక్చరర్‌గా (జెల్)గా పదోన్నతులు కల్పించాలని, కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, హెల్త్ కార్డు సమస్యను వేగవంతంగా పరిష్కరించాలని కోరారు.

ప్రజల ఆరోగ్యాన్ని కార్పొరేటర్లకు అప్పగించొద్దు

వైసీపీ కన్వీనర్ తనకంటి జయప్ప

విశాలాంధ్ర-అమడగూరు : మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ సోమవారం పుట్టపర్తిలో భారీ నిరసన ర్యాలీ నిర్వహిస్తున్నట్లు మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కన్వీనర్ తనకంటి జయప్ప తెలిపారు. పుట్టపర్తి మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ ర్యాలీ జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మెడికల్ కాలేజీలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడం వల్ల పేద, మధ్యతరగతి ప్రజలు వైద్య సేవలకు దూరమవుతారని ఆందోళన వ్యక్తం చేశారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి హయాంలో కోట్లాది రూపాయలతో నిర్మించిన మెడికల్ కాలేజీలను ప్రభుత్వమే నిర్వహించి పేదలకు వైద్యం అందించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో భాగంగా, సత్యసాయి జిల్లాలో సేకరించిన సంతకాల ప్రతులతో పుట్టపర్తి గణేష్ సర్కిల్ నుంచి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వరకు ర్యాలీ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో వైసీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజాసంఘాలు, అన్ని వర్గాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఆలయ సమీపంలో నీళ్ల ట్యాంకు ప్రారంభం..

విశాలాంధ్ర-యాడికి: మండల కేంద్రంలోని భద్రావతి భావనారాయణ స్వామి ఆలయ సమీపంలో మార్కండేయ స్వామి పద్మశాలీయుల కులస్తుల ఆధ్వర్యంలో ఆదివారం నీళ్ల ట్యాంకును ప్రారంభించారు. భక్తుల సౌకర్యార్థం చేపట్టినదిగా నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు జానపాటి గురుమూర్తి స్వామి, వైస్ ప్రెసిడెంట్ కాలవ శ్రీనివాసులు, కోశాధికారి కుంటు మల్ల కృష్ణ రంగ పనిబాబు, సెక్రటరీ లింగంపల్లి నాగ రంగయ్య, జనరల్ సెక్రటరీ పోకూరు జయప్రసాద్ చిట్టి పాల్గొన్నారు. అదేవిధంగా బీజేపీ మండల అధ్యక్షుడు వద్ది రాజశేఖర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో జానపాటి గురుప్రసాద్, జక్కా రామయ్య, కాలవ జనార్ధన, శిరసాల దామోదర్, శిరసాల సురేష్ బాబు, జానుపాటి శ్రీనివాసులు, జానపాటి నాగేష్, తిరుపతయ్య, యుగంధర్ పాల్గొన్నారు.

17న విశ్రాంతి ఉద్యోగుల దినోత్సవం

విశాలాంధ్ర-ఉరవకొండ : ఈనెల 17వ తేదీన స్థానిక ప్రభుత్వ విశ్రాంతి ఉద్యోగుల కార్యాలయంలో జాతీయ విశ్రాంతి ఉద్యోగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నట్లు విశ్రాంతి ఉద్యోగుల సంఘం అధ్యక్షులు కె.కృష్ణప్ప తెలిపారు.ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ విశ్రాంతి ఉద్యోగుల జాతీయ దినోత్సవంతో పాటు సర్వసభ్య సమావేశాన్ని కూడా నిర్వహిస్తున్నామన్నారు. 70 సంవత్సరాలు నిండిన విశ్రాంతి ఉద్యోగులకు ఘనంగా సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉరవకొండ సబ్ ట్రెజరీ ఆఫీసర్ నాగేంద్రబాబు, ఉరవకొండ ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ సుధాకర్, ఉరవకొండ ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ డి.షాజహాన్ బాషా హాజరవుతున్నట్లు తెలిపారు.

అభిమానుల మధ్యలో జన్మదిన వేడుకలు ..

విశాలాంధ్ర-కణేకల్లు: రాష్ట్ర ఉప్పర కార్పొరేషన్ డైరెక్టర్ క్లస్టర్ ఇంచార్జ్ ఆనంద్ రాజులు జన్మదిన వేడుకలను కనేకల్ క్రాస్ లోని వారి స్వగృహం నందు ఆదివారం రోజున ఘనంగా నిర్వహించారు. ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని వేడుకలను మరింత ఉత్సాహభరితంగా నిర్వహించారు. ఆనంద్ రాజులు సేవలను ప్రశంసిస్తూ నాయకులు ఆయనకు ఆయురారోగ్యాలు, రాజకీయ జీవితంలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మాజీ మండల కన్వీనర్ లాలప్ప, మండల కన్వీనర్ వన్నారెడ్డి, చెరువు సంఘం అధ్యక్షులు బిటి. రమేష్, వ్యవసాయ కమిటీ సభ్యులు చాంద్‌బాషా, కవిట్ మాబు, రైస్ మిల్ కాంట్రాక్టర్ నాగప్ప, సంపత్, రాజా తదితర తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

16న జిల్లా ఖోఖో జట్ల ఎంపికలు

విశాలాంధ్ర-ఉరవకొండ: ఈనెల 16వ తేదీన స్థానిక ఎస్.కె ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జిల్లా పురుషుల, మహిళలు, జూనియర్ బాలబాలికల జిల్లా ఖోఖో జట్లు ఎంపికలు నిర్వహించనున్నట్లు జిల్లా అసోసియేషన్ కార్యదర్శి నిరంజన్‌రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు మారుతి ప్రసాద్ టీ.ప్రభాకర్, పుల్లా రాఘవేంద్రులు తెలిపారు. ఆదివారం ఉరవకొండలో వారు విలేకరులతో మాట్లాడుతూ ఆసక్తిగల క్రీడాకారులు ఒరిజినల్ డేట్ అఫ్ బర్త్, ఆధార్ కార్డు ధ్రువీకరణ పత్రాలను తమ వెంట తీసుకురావాలని తెలియజేశారు. ఎంపికైన జిల్లా జూనియర్ బాలబాలికల జట్లు ఈనెల 18 నుంచి 20వ వరకు ప్రకాశం జిల్లా జై పంగులూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటుందిని. సీనియర్ పురుషుల మహిళల జిల్లా జట్లు ఈనెల 24 నుండి 26 వరకు గుడివాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో జిల్లా జట్లు పాల్గొంటారని ఆంధ్ర ఖోఖో అసోసియేషన్ ఉపాధ్యక్షులు పుల్లారెడ్డి తెలిపారు.

బిక్షగాళ్లకు, అనాథలకు దుప్పట్లు పంపిణీ ..

విశాలాంధ్ర ధర్మవరం: పట్టణములోని రైల్వే స్టేషన్లో, ఆర్టీసీ బస్టాండ్లలో బిక్షగాళ్లకు, అనాథలకు పట్టణంలోని శ్రీ సత్య సాయి సేవ సమితి గాంధీ నగర్ నిర్వాహకులు దుప్పట్లను పంపిణీ చేశారు. ఆదివారం వారు మాట్లాడుతూ ఈ కార్యక్రమం దాతలుగా గర్జాల అశ్వత నారాయణ, ఉడుముల రాజశేఖర్, ఆవుల శ్రీనివాసులు, చంద్ర, రెడ్డప్పలు వ్యవహరించడం పట్ల వారికి సమితి తరఫున ప్రత్యేక కృతజ్ఞతలను తెలియజేశారు. ప్రస్తుతం పట్టణంలో చలి అధికంగా ఉండటం వలన ఈ దుప్పట్లో కంపెనీ కార్యక్రమాన్ని చేపట్టి చలి నుంచి కొంత ఉపశమనం కలిగిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో 8 మంది సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు.

గంపల రమణారెడ్డి చేతుల మీదుగా రగ్గుల పంపిణీ

విశాలాంధ్ర-గోరంట్ల: పట్టణంలోని గంగంపల్లి రోడ్డులోగల గంపల రామకృష్ణారెడ్డి కాంపౌండ్ ఆవరణలోని సక్సెస్ స్కూల్ లో ఆదివారం గంపల రమణారెడ్డి చేతుల మీదుగా 150 మంది పేదలకు దుప్పట్లు పంపిణీ చేసి తమసేవా భావాన్ని చాటుకున్నారు. సమాజ సేవకులు బైసాని శ్రీనివాస్ గుప్తా సూచన మేరకు ఇద్దరు దాతల సహకారంతో గంపల రమణారెడ్డి దాదాపు 150 చలి దుప్పట్లను సమకూర్చారు. ఈ సందర్భంగా ఆదివారం పట్టణంలోని స్ట్రక్చర్ స్కూల్ ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశానికి గంపల రమారెడ్డి ముఖ్య అతిథిగా హాజరు అయ్యారు.ఈ కార్యక్రమాల్లో ఆయనతోపాటు స్కూల్ కరస్పాండెంట్ అంజన్ రెడ్డి, బెస్త లక్ష్మీనరసు, అడ్వకేట్ తిప్పు నాయక్, సర్పంచ్ వాసు నాయక్ తదితరులు ఈ పంపిణీ లో పాలుపంచుకున్నారు.ఈ సందర్భంగా నిరుపేద వృద్ధులకు గంపల రమణారెడ్డి మిత్రులు అన్వర్, తాడిపత్రి సీఐ హరొహరరావు ల ఆర్థిక సాయంతో కొనుగోలు చేసిన దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గంపల రమణారెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృశ్య బైసాని శ్రీనివాస గుప్తా అభ్యర్థన మేరకు ఈ రగ్గులను సమకూర్చినట్లు ఆయన తెలిపారు. భవిష్యత్తులో పేదల కోసం ధనవంతు బాధ్యతగా స్పందించి సాయం అందిస్తానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

వివోఏల సంఘ సభ్యుల సమస్యలను పరిష్కరించాలి

సి.ఐ.టి.యు డిమాండ్..

విశాలాంధ్ర-రొళ్ళ: ఐదు మండల వ్యాప్తంగా ఉన్న వివోఏల సంఘ సభ్యుల సమస్యలను పరిష్కరించాలని సి.ఐ.టి.యు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులేసు,సిఐటియు జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు.ఆదివారం మండల పరిధిలోని కొత్తపాళ్యం గ్రామంలో ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో వివోఏల సంఘ సభ్యుల సమావేశాన్ని శివరామి రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు.ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు మరియు సిఐటియు జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు మాట్లాడుతూ వివోఏల సంఘం సభ్యుల దగ్గర ఇతర పనులు చేయించకూడదని గత నాలుగైదు నెలల నుండి ఉన్న పెండింగ్ జీతాలు వెంటనే ఇవ్వాలన్నారు. అదేవిధంగా ఇన్సూరెన్స్ జీతం పెంపుదల రాజకీయ వేధింపులు ఆపాలని కార్మిక ఉద్యోగుల సమస్యలపై ఈ నెల డిసెంబర్ 31 నుంచి జనవరి 4 వరకు అఖిలభారత సిఐటియు 18వ మహాసభలు జరుగుతున్నాయని దేశవ్యాప్తంగా 2500 మంది ప్రతినిధులు మహాసభకు హాజరవుతున్నారని ఆ మహాసభలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక ఉద్యోగుల వ్యతిరేక విధానాలపై చర్చ జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి పెద్దఎత్తున కార్మికులు మహాసభకు తరలి రావాలని అదేవిధంగా రేపు పుట్టపర్తిలో జరిగే కార్మిక కర్షక భవనంలో జరిగేటటువంటి జిల్లా వీవోఏల సంఘం సభ్యుల సమావేశానికి సత్యసాయి జిల్లా వివోఏల సంఘం సభ్యులు అందరూ కూడా హాజరు కావాలని తెలియజేశారు.ఈ సమావేశానికి వివోఏల సంఘం రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ కే.ధనలక్ష్మి హాజరవుతున్నారన్నారు అదేవిధంగా కేంద్ర ప్రభుత్వం ఈ మధ్యకాలంలో 29 కార్మిక చట్టాలను నాలుగు కోడ్లగా మార్చి అమల్లోకి తెచ్చిందని దీని వలన కార్మిక చట్టాలను నిర్వీర్యమై పెట్టు బడుదారులకు యజమానులకు అనుకూలంగా కేంద్ర ప్రభుత్వం చట్టాలు మార్చిందని దీన్ని మొత్తం కార్మిక ఉద్యోగులందరూ కూడా వ్యతిరేకించాలని దీనిపై కూడా దేశవ్యాప్తంగా ఉద్యమం ఉధృతం చేయాల్సి ఉంటుందని ఆయన తెలిపారు కార్యక్రమంలొ జిల్లా ఉపాధ్యక్షులు కే.వి.పి.ఎస్.కే రామాంజనేయులు,వివోఏల సంఘం జిల్లా అధ్యక్షులు డి.హెచ్ రాయుడు ఐదు మండలాల వివోఏ నాయకులు పాల్గొన్నారు..

బాల్యవివాహాలను అరికట్టాలి.. తహసీల్దార్ సురేష్ బాబు

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణ గ్రామీణ ప్రాంతాలలో బాల్య వివాహాలను తప్పనిసరిగా అరికట్టాలని తాసిల్దార్ సురేష్ బాబు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బాల్య వివాహాలపై వివిధ విభాగాల అధికారులకు సమాచారాన్ని ఇవ్వడం జరిగిందన్నారు. బాల్య వివాహాలను అరికట్టి బాల్య వివాహ రహిత పట్టణంగా తీర్చిదిద్దేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. ముఖ్యంగా ఐసిడిఎస్ శాఖ వీటిపై ప్రత్యేక దృష్టిని సారించాలని తెలిపారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగినట్లయితే సంబంధిత అధికారులు వెంటనే చొరువ తీసుకొని ఆ వివాహాలను ఆపుదల చేయాలని తెలిపారు. అందుకే కలెక్టర్ ఆదేశాల మేరకు బాల్య వివాహ నిర్మూలనకు నూరు రోజుల అవగాహన కార్యక్రమాన్ని కూడా నిర్వహించడం జరుగుతుందన్నారు.

బాల్య వివాహాలు జరగకుండా గ్రామం నుంచి వాడు స్థాయిలో సకాలంలో నివారణ చర్యలు చేపట్టాలని తెలిపారు. పాఠశాలలు, ఐసిడిఎస్ కేంద్రాలు, పోలీస్ శాఖ ,గ్రామ, వార్డు స్థాయిలోనే సకాలంలో బాల్యవివాహాల నివారణ చర్యలను తీసుకోవాలని తెలిపారు. బాల్య వివాహాలు చేయడం నేరమని, వివిధ మతాల పెద్దలకు సైతం తెలియజెప్పాలన్నారు. కావున తల్లిదండ్రులు తమ ఆడపిల్లల పట్ల ఉన్నత చదువుకు ప్రోత్సహించాలి తప్ప, బాల్య వివాహాలు చేరాదని తెలిపారు.

కర్ణాటక వాసి హత్య కేసు ఛేదన

ముగ్గురు నిందితుల అరెస్ట్



విశాలాంధ్ర-అమడగూరు: భూమి వివాదాలు, అవమానంతోనే హత్య చేసినట్లు దర్యాప్తులో వెల్లడి. ప్రత్యేక పోలీస్ బృందాల గాలింపుతో నిందితుల పట్టివేత.అమడగూరు పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన కర్ణాటక వాసి ముత్తప్ప హత్య కేసును పోలీసులు ఛేదించారు. ఈ కేసులో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసినట్లు జిల్లా ఎస్పీ శ్రీ ఎస్. సతీష్ కుమార్ ఐపీఎస్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు భూమి వివాదాలతో పాటు, తన అన్న కూతురుతో చెప్పుతో కొట్టించాడన్న అవమానాన్ని భరించలేక నిందితులు పగతో హత్యకు పాల్పడ్డారని విచారణలో తేలింది. 03-09-2025 రాత్రి ఆకులవారిపల్లి శివారులో ఇనుప రాడ్లతో దాడి చేసి ముత్తప్పను హత్య చేసినట్లు పోలీసులు వెల్లడించారు. నిందితులను మహమ్మదాబాద్ గ్రామంలో ఆదివారం అరెస్టు చేసి రిమాండ్ కు తరలించామన్నారు. నేరాలకు పాల్పడిన వారిని ఎక్కడున్నా వదిలిపెట్టమని, చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు.సమావేశంలో డీఎస్పి విజయ్ కుమార్, సిఐలు, నరేంద్ర రెడ్డి, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు శ్రీనివాసులు పాల్గొన్నారు.

కంటి వెలుగు ప్రసాదించడమే మా లక్ష్యం

విశాలాంధ్ర-ధర్మవరం: పేద ప్రజలకు కంటి వెలుగును ప్రసాదించడమే మా లక్ష్యము అని రోటరీ క్లబ్ అధ్యక్షుడు నాగభూషణ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో (వన్ టౌన్ పోలీస్ స్టేషన్ ఎదురుగా) ఉచిత కంటి ఆపరేషన్ల వైద్య శిబిరం రోటరీ క్లబ్, శంకరా కంటి ఆసుపత్రి బెంగళూరు, జిల్లా అంతత్వ నివారణ సంస్థ వారి సహకారంతో నిర్వహించారు. ఈ శిబిరానికి దాతగా కీర్తిశేషులు కోరా రామ సుబ్బారెడ్డి తమ్ముడు కూర రామిరెడ్డి వారి కుటుంబ సభ్యులు వ్యవహరించారు. 110 మంది కంటి రోగులు పాల్గొనిగా వారికి శంకరా కంటి ఆసుపత్రి కంటి డాక్టర్ అబీద్ వైద్య చికిత్సలు అందించగా 75 మంది కంటి ఆపరేషన్లకు ఎంపిక చేశారు. కంటి ఆపరేషన్‌కు ఎంపికైన వారికి ఉచిత రవాణా, ఉచిత వసతి, ఉచిత భోజనం, ఉచిత ఆపరేషన్లు నిర్వహించబడునని తెలిపారు. కంటి నిపుణులు సలహాలతో కళ్ళలలో ఉచిత లెన్స్ కూడా అమర్చబడునని తెలిపారు.

ఆపరేషన్ అనంతరం ఉచితంగా అద్దాలు ఇస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ కోశాధికారి నరేందర్ రెడ్డి, క్యాంపు చైర్మన్ దాస్, సాంస్కృతిక మండలి అధ్యక్షులు సత్రశాల ప్రసన్నకుమార్, గర్రె రమేష్ బాబు, శ్రీనివాస్ రెడ్డి, జయసింహ, శివయ్య, సుదర్శన్ గుప్తాతో పాటు శంకరా కంటి ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

భౌతిక దాడులు చెడు సాంప్రదాయాలకు బీజం..

విశాలాంధ్ర -విడపనకల్లు : విడపనకల్లు మండలం ఉండబండ గ్రామంలో గత గురువారం గోపాల్ అనే వ్యక్తి మీద టిడిపికి చెందిన కొంతమంది వ్యక్తులు విచక్షణ రహితంగా దాడి చేసి గాయపరచడం జరిగింది. బాధితుడి గోపాల్ కి ఫోన్ చేసి దాడికి సంబంధించిన వివరాలను, ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిని అడిగి మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వర్ రెడ్డి అడిగి తెలుసుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న విడపనకల్లు వైసీపీ సీనియర్ నాయకులు కరణం భీమరెడ్డి, వైసిపి కన్వీనర్ కురుబ రమేష్, మండల వైసీపీ ఉపాధ్యక్షుడు బోయ నాగేంద్ర, నాయకులు సుంకన్న గోపాల్ కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా బాధితుడితో మాట్లాడుతూ ప్రశాంతమైన పల్లెటూర్ల వాతావరణాన్ని చెడగొట్టొద్దండని కన్వీనర్ రమేష్ అన్నారు. మీకు, మీ కుటుంబానికి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని, దాడి చేసిన వారిపై పోలీస్ శాఖ వెంటనే కేసు నమోదు చేయడంతో పాటు చర్యలు తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో దాడి చేసిన వారిపై న్యాయపరంగా చర్యలు తీసుకునే విధంగా చూస్తామని హెచ్చరించారు. సీనియర్ నాయకులతోపాటు హేమంత్, అశోక్, శీన, మాలాపురం రామాంజనేయులు, శ్రీనివాసులు, గురుదాస్ తదితరులు పాల్గొన్నారు.

తండ్రి వర్ధంతికి అన్నదానం

విశాలాంధ్ర-యాడికి : మండలంలోని రాయల చెరువు గ్రామంలోని లీలావతి వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్లు ఆదివారం ఆశ్రమ నిర్వాహకురాలు పరిమి కృష్ణవేణి తెలిపారు. అనంతపురం రూరల్ ఉప్పరపల్లి గ్రామానికి చెందిన చింతమేకల ఈశ్వరయ్య వర్ధంతి సందర్భంగా ఆయన కుమారుడు చింతమేకల చిన్నరాయుడు ఆశ్రమంలోని వృద్ధులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆశ్రమ నిర్వాహకురాలు పరిమి కృష్ణవేణి మరియు ఆశ్రమంలోని వృద్ధులు వారి కుటుంబానికి కృతజ్ఞతలు తెలిపారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

విశాలాంధ్ర-బొమ్మనహాల్: మండలంలోని దర్గా హొన్నూర్ జడ్పీ ఉన్నతపాఠశాలలో ఆదివారం పూర్వవిద్యార్థుల సమ్మేళనం ఘనంగా జరిగింది. ఆ పాఠశాలలో 1999-2000వ విద్యాసంవత్సరంలో టెన్త్ చదివిన విద్యార్థులు 50 మంది సుమారు 25ఏళ్ల తర్వాత అదే పాఠశాలలో కలిశారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. నాటి గురువులు వన్నా రెడ్డి, బండయ్యా, నజీర్ భాష, గుండురావు, మల్లికార్జున, తిమ్మప్ప, రామక్క ప్రకాశ్ రెడ్డి,తదితరు ఉపాధ్యాయులనుశాలువాలు, పూలమాల లతో సన్మానించారు. సాయంత్రం వరకు అక్కడే ఆనందంగా గడిపారు.

క్రీడాకారులకు క్రికెట్ కిట్ అందజేత

విశాలాంధ్ర-గోరంట్ల: జిల్లాలో జరుగుతున్న ఉపాధ్యాయుల క్రికెట్ టోర్నమెంట్లో గోరంట్ల ఉపాధ్యాయుల టీం పలు మ్యాచ్లలో గెలుపొందుతూ సక్సెస్ గా ముందుకు వెళుతున్న నేపథ్యంలో మంత్రి సవితమ్మ ఆదేశాల మేరకు మండల తెలుగుదేశం పార్టీ నాయకులు, సమాజ సేవకులు నిమ్మల శ్రీధర్ విజయకేతనంతో దూసుకుపోతున్న మండల ఉపాధ్యాయ టీంకు నూతన క్రికెట్ కిట్‌ను సమకూర్చారు. ఇందులో భాగంగా ఆదివారం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మండల తెలుగుదేశం పార్టీ కన్వీనర్ బాలకృష్ణ చౌదరి చేతుల మీదుగా ఉపాధ్యాయ క్రికెట్ టీంకు క్రికెట్ కిట్టును అందజేశారు. ఈ కార్యక్రమంలో పసుపులేటి శ్రీనివాసులు, ఉత్తమ రెడ్డి, ప్రతాప్ చౌదరి, కురుబ మల్లికార్జున, మాజీ వార్డ్ మెంబర్ వట్టి సుధాకర్‌లతో పాటు ఉపాధ్యాయులు దామోదర్ రెడ్డి, నాగరాజు, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.